క్లుప్తంగా

విఠలేశ్వరుడికి పూజలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మాఘ ఏకాదశిని పురస్కరించుకొని ఎమ్మెల్యే సంజీవరెడ్డి మహారాష్ట్రలోని పండరీపూర్ విఠలేశ్వర, రుక్మిణి ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం పండరీపూర్‌లోని కరణ్ గజేంద్ర భారతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, కామారెడ్డి జిల్లా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ


ఆట వస్తువులను అందజేస్తున్న ఎంఈఓ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని భవిత కేంద్రం పిల్లలకు సిద్దార్థ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు క్రీడాసామగ్రిని ఎంఈఓ బస్వరాజ్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని దివ్యాంగులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిద్దార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, అంజనేయులు, ఉపాధ్యాయుడు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోండి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుష్మశ్రీ,, జెడ్పీటీసీ సుప్రజ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్, నందిగామ, ఘనపూర్, పాటి, భానూర్, క్యాసారం, ఇస్నాపూర్, రుద్రారం, లక్డారం, పాశమైలారం గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిగౌడ్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, పాటి గ్రామ ప్రత్యేక అధికారి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, లక్డారం స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ పీపీ రాథోడ్, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బుదేరా చౌరస్తా సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బంటారం మండల పరిధిలోని తొరమామిడి గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి బైక్‌పై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుదేరా చౌరస్తా సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రఘునాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి అన్న రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

అందోలు తహసీల్దారుగా భాస్కర్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర్‌కుమార్

జోగిపేట(అందోల్): అందోలు తహసీల్దారుగా భాస్కర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పుల్కల్ తహసీల్దారుగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు అందోలు తహసీల్దారుగా పనిచేసిన ఆంటోని ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బదిలీపై వచ్చిన తహసీల్దారు భాస్కర్‌కుమార్‌కు డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సాగు బడి.. కొత్త ఒరవడి

పొలం బాట పట్టిన 'ఉద్యాన' విద్యార్థినులు
- పండ్ల తోటలు, కూరగాయ పంటల పరిశీలన
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ


కలుపు తీస్తున్న విద్యార్థినులు


మొక్కలకు నీరు పడుతున్న విద్యార్థిని

జహీరాబాద్: నాలుగేళ్లుగా తరగతి గదులకే పరిమితమై వ్యవసాయ సాగు పద్ధతుల మెళకువలపై విద్యనభ్యసించి క్షేత్ర స్థాయిలో రైతులు చేపట్టే సాగు పద్ధతులను తెలుసుకునేందుకు రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు పొలం బాట పట్టారు. గ్రామీణ ఉద్యాన పని–అనుభవ శిక్షణలో భాగంగా సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రానికి మూడు నెలల శిక్షణ నిమిత్తం విద్యార్థినులను కేటాయించారు. ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర వీరికి జహీరాబాద్ మండలంలో ఉద్యాన పంటలు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉండటంతో మండల పరిధిలోని రంజోల్ గ్రామానికి 15 మందిని, చిన్న హైదరాబాద్ గ్రామానికి 14 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కేటాయించారు.

వైవిధ్యమైన పంటలకు ప్రసిద్ధి

జహీరాబాద్ ఏఈఓ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రాంతంలో సాగయ్యే మామిడి, జామ, అరటి, బత్తాయి, బొప్పాయి, అల్లం, పుసుపు, ఆలుగడ్డ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు, పుచ్చకాయలు, పూలతోటలు మొదలైన ఉద్యాన పంటలను సాగుచేసే విధానంపై శిక్షణ పొందుతున్నారు. ఒక్కో విద్యార్థినికి ఒక్కో రైతును అతిధేయ రైతుగా నియమించారు. 3 నెలల పాటు వారి క్షేత్రాలకు వెళ్లి రైతు చేపట్టే సాగు పద్ధతులను అవగతం చేసుకోవాల్సి ఉంటుంది.

పంట ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయానికి పరోక్షంగా ఉపయోగపడే రెవెన్యూ శాఖ, బ్యాంకు, వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల ద్వారా కలిగే ఉపయోగాలు, అందే పథకాల గురించి అవగాహన పొందుతారు. సాగు పెట్టుబడి సహాయం నుంచి తమ పంట ఉత్పత్తులు అమ్ముకునే వరకు ఎలాంటి సాధక బాధకాలు ఉంటాయనే వాటిపై పూర్తిగా అవగాహన పెంపొందించుకుంటారు. కూరగాయల నారు పెంపకంపై నర్సరీని సందర్శించి అవగాహన పొందుతారు. పంట ఉత్పత్తులైన పసుపు, మిర్చి, ధనియ పొడి తయారీ విధానంపై సైతం శిక్షణ పొందుతారు.

సాగు విధానాలపై విద్యార్థినుల ఆసక్తి

గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల, అంగన్‌వాడీ, పశు సంవర్ధకశాఖ, పోస్టాఫీసు, ఆరోగ్య కేంద్రం, మున్సిపాలిటీ, ఫర్టిలైజర్స్ దుకాణాలను సందర్శించి అక్కడ ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుంటారు. ఇప్పటికే నూతన పంటలైన డ్రాగన్ ఫ్రూట్, చియా, జెరేనీయం, ఆపిల్, అంజీర పంటలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో రైతులు పాటించే సాగు మెలకువలు, సాగు విధానం, పెట్టుబడి ఖర్చు, యాజమాన్య విధానం, వచ్చే ఆదాయం తదితర అంశాలపై రికార్డులు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తారు.


మొక్కలకు పిచికారీ చేస్తున్న విద్యార్థిని

వైవిధ్య పంటలను చూశా



ఇక్కడ చూసిన వివిధ వైవిధ్య భరితమైన పంటలను మరెక్కడా చూడలేదు. ఇక్కడి నేలలు ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి జామ, అల్లం, అరటి, ఆలుగడ్డ ఉత్పత్తులు అంటే అందరికీ సుపరిచితం. ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. జీవితంలో మరిచిపోలేని అనుభవం పొందాను.
– పూజిత, విద్యార్థిని, ఖమ్మం

అనుభూతిని ఇచ్చింది



క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై నేర్చుకోవడం గొప్ప విషయం. ఇక్కడి ఏఈఓ నిపుణుడి మాదిరిగా మాకు ఎల్లవేళలా వెన్నంటి ఉంటూ అన్ని రకాల పంటలను చూపించారు. ఇక్కడి రైతులు ఎంతో శాంతస్వభావులు. పలు రకాల పంటలను ప్రత్యక్షంగా చూడడం సంతోషం కలిగించింది.
– రసజ్ఞ, విద్యార్థిని, మంథని

పోలీస్ శాఖకు కీర్తి, ప్రతిష్టలు తేవాలి

- అదనపు ఎస్పీ సంజీవరావు
- సివిల్, ట్రైనీ కానిస్టేబుల్స్‌కు కిట్లు అందజేత


ట్రైనీ కానిస్టేబుల్స్‌కు కిట్లు అందజేస్తున్న ఏఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి: నూతనంగా ఎంపికైన సివిల్, ఏఆర్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ పోలీసుశాఖకు కీర్తి, ప్రతిష్టలు తేవాలని అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. జిల్లా పోలీసుశాఖకు నియామకమై 9 నెలల బేసిక్ ట్రైనింగ్‌కు వెళ్తున్న సివిల్, ఏఆర్ ట్రైనీ పోలీసు కానిస్టేబుల్స్‌కు మంగళవారం కిట్ ఆర్టికల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మేడ్చల్, వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్, కరీంనగర్, తదితర ట్రైనింగ్ సెంటర్లకు 472 మంది ట్రైనీ పోలీసు కానిస్టేబుల్స్ వెళ్తున్నట్లు తెలిపారు. ఇండోర్, అవుట్ డోర్ ఫాకల్టీ చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత పొంది సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఆర్ఐ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ లాలునాయక్, ఆర్ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశం, అశోక్ మినిస్టీరియల్, సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీలో వికారాబాద్ జిల్లా జడ్జి పూజలు


కేతకీ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయాన్ని వికారాబాద్ జిల్లా స్పెషల్ జ్యూడిషియల్ జడ్జి నామల అశోక్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మినీ డీసీఎం బోల్తా



కల్హేర్(నారాయణఖేడ్): సంగారెడ్డి–అకోల 161 జాతీయ రహదారిపై వాహనం బోల్తా పడిన సంఘటన నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి సమీపంలో శివునికుచ్చ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. నేషనల్ హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన కిరాణం ఏజెన్సీకి సంబంధించిన మినీ డీసీఎం వాహనం జోగిపేటకు వెళ్తోంది. ఈ క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలోని వస్తువులు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని వాహనాన్ని పక్కకు తొలగించారు.

సాంకేతికతపై దృష్టి సారించండి

పటాన్‌చెరు: భవిష్యత్తు సాంకేతికతలో కృత్రిమ మేధ(ఏఐ) కీలక భూమిక పోషించబోతోందని, విద్యార్థి దశ నుంచే కృత్రిమ మేధపై పట్టు సాధించాలని నెక్స్ట్ వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోగాన్ (సాంకేతిక మెళకువలను ప్రోత్సహించే విద్యార్థి విభాగం) ఆధ్వర్యంలో మంగళవారం జెనరేటివ్ ఏఐ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ సాధనాలు, వాటి వినియోగంపై సమగ్రమైన అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని ఆదినారాయణస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరు కావడంతో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని దేవాలయ ట్రస్టీ చైర్మన్ రామోజీరావు తెలిపారు. – జిన్నారం(పటాన్‌చెరు)

సంక్షిప్త వార్తలు

నేడు శోభాయాత్ర

నారాయణఖేడ్: అయోధ్యకు వెళ్తున్న యాత్రికులతో ఈ నెల 21న శోభాయాత్రను నిర్వహించనున్నట్లు ఖేడ్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రజినీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని శ్రీరామ మందిరం నుంచి పురవీధుల గుండా శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

సీసీ రోడ్ల ప్రారంభం

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రంలో మంగళవారం సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, లకొన్నరెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని లక్ష్మిపతిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయానికి ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి పృథ్వీరాజ్ రూ.51వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. సంగారెడ్డిలో పట్టణంలోని 374 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించి సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

పటాన్‌చెరు: అనారోగ్యానికి గురైన పర్యావరణవేత్త, డాక్టర్ కిషన్‌రావును పర్యావరణ వేత్తలు ప్రొఫెసర్ పురుషోత్తం, శిల్పలు మంగళవారం పరామర్శించారు. కిషన్‌రావు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

ఘనంగా క్షేత్ర దినోత్సవం


శనగ పంటను చూపుతున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: మండల పరిధిలోని రంజోల్ గ్రామంలో ఏరువాక కేంద్రం సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో మంగళవారం శనగ పంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, ఏఈఓ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఎంబీజీ(నంద్యాల శనగ) 452 రకం శనగ విత్తనాన్ని రైతు రాములుకు చెందిన పొలంలో ప్రదర్శన నిమిత్తం సాగు చేయించామన్నారు. ఎండు తెగుళ్లను తట్టుకున్నట్లు, అధిక పిలకలతో ఎక్కువ కాయలు కాసినట్లు గుర్తించామని తెలిపారు. పంట అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ విత్తనాన్ని మిగతా రైతులు కూడా సేకరించుకొని వచ్చే సీజన్‌లో సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శేఖర్, రామకృష్ణ, జగన్, మల్లేశం, రాములు, వెంకట్, పండరి, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ ఫేర్‌తో నైపుణ్యాభివృద్ధి

జహీరాబాద్ టౌన్ : అకడమిక్ ఫేర్ ద్వారా పిల్లల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని ఆర్ఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. పస్తాపూర్‌లోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో మంగళవారం అకడమిక్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి 9వ తరగతి విద్యార్థులు తయారుచేసిన 420 నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అకడమిక్ ఫేర్స్‌తో విద్యార్థుల్లో ఆలోచన శక్తి కూడా పెరుగుతుందని వివరించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చిన్నారులు తయారుచేసిన నమూనాలను పరిశీలిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

వట్‌పల్లి(అందోల్): పుల్కల్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల విద్యార్థిని లైంగికంగా వేధించిన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు వట్‌పల్లి చౌరస్తాలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుల్కల్‌లో పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థిని వేధించిన ప్రిన్సిపాల్ వట్‌పల్లి మండల కేంద్రంలో అక్షర స్కూల్‌ను నిర్వహిస్తున్నాడని తెలిపారు. అనుమతి లేకుండా పైతరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని మండిపడ్డారు. ఈ విషయమై డీఈఓకు విచారణ చేపట్టి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా విద్యార్థి ప్రముఖ్ అరవింద్, భజరంగ్‌దళ్ అధ్యక్షుడు ప్రశాంత్, గోరక్షక్ ప్రముఖ్ వంశీరెడ్డి, మండల కోకన్వీనర్ వీరేశం, సత్సంగ్ ప్రముఖ్ ఆంజనేయములు, పాండు, రమేశ్, రవి పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో గెలుపోటములు సహజం


బహుమతులను చూపుతున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్: అన్నిరంగాల్లో గెలుపోటములు సహజమని సన్‌రైజ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వామిగౌడ్, ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి లవన్‌కుమార్ అన్నారు. ఏబీవీపీ సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ ఖేలో కార్యక్రమ ముగింపు సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ స్వామిగౌడ్, లవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ మాధవ, కన్వీనర్ ఆకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భారతి, అనుష, పూజ, తనాజి, నిఖిల్, వెంకట్, భానుప్రకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు చేసుకోవద్దు

- సమస్యలను మనోధైర్యంతో అధిగమించాలి
- తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి అర్బన్: సమస్యలు వచ్చినప్పుడు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. ఆత్మహత్యల నిరోధక దినోత్సవాన్ని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ.. మనకు జీవితాన్ని ఇచ్చింది కన్నతల్లి అని, మనకు ఆత్మహత్య చేసుకునే అర్హత లేదన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యనూ మనోధైర్యంతో అధిగమించి పరిష్కరించుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2011 ఫిబ్రవరి 19న తారా కళాశాలకు చెందిన బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సమస్యలకు ఆత్మహత్యలే అంతిమ పరిష్కారం కాదనే విషయాన్ని గమనించాలని సూచించారు.

భార్య, వదిన అదృశ్యంపై ఫిర్యాదు


వర్ష


పావని

పటాన్‌చెరు టౌన్: భార్య, వదిన అదృశ్యంపై ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ బస్తీకి చెందిన లోకేశ్‌కుమార్ భార్య వర్ష ఈ నెల 19వ తేదీ ఉదయం గొడవ పడ్డారు. దీంతో లోకేశ్‌కుమార్ వదిన పావని భార్యాభర్తలకు సర్ది చెప్పింది. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూసేసరికి వర్ష, పావని ఇద్దరు కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు వారి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వర్ష భర్త లోకేశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడిని కలిసి వస్తానని...


మనోహర్

స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీకి చెందిన స్వర్ణరాజు కుమారుడు మనోహర్ లింగంపల్లి పరిధిలోని ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన మనోహర్ స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మనోహర్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడి అదృశ్యంపై తండ్రి స్వర్ణరాజు మంగళవారం సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.